సాక్షి మెదక్

మంగళవారం । 3 । జనవరి । 2023



చట్టాలపై అవగాహన అవసరం

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి లక్ష్మి శారద తెలిపారు. 8లో



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

అప్పుల బాధతో ఓ రైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసున్నాడు. ఈఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం బంగారులొద్ది తండాలో చోటుచేసుకుంది. 8లో



నిధులు వెంటనే విడుదల చేయాలి

నిధులను వెంటనే విడుదల చేయాలని హవేలిఘనపూర్ మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. 9లో

న్యూస్‌రీల్

పీహెచ్‌సీల్లో 18 మంది రెగ్యులర్ వైద్యులు



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ చందూనాయక్

మెదక్‌జోన్: జిల్లాలోని పీహెచ్‌సీలలో 18 మంది రెగ్యులర్ వైద్యులు సోమవారం విధుల్లో చేరారని జిల్లా వైద్యాధికారి చందూనాయక్ తెలిపారు. పెద్దశంకరంపేట, నార్సింగ్, చేగుంట, అల్లాదుర్గ్‌లో ఒక్కొక్కరు.. రేగోడులో ఇద్దరు, కొడిపల్లిలో ముగ్గురు, రామాయంపేటలో ఇద్ద రు, తూప్రాన్‌లో, వెల్దుర్తి, దొంగల ధర్మారంలో ఒక్కొక్కరు, టేక్మాల్‌లో ఇద్దరు, రెడిపల్లి, రంగపేటలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 18 మంది నూతనంగా విధుల్లో చేరారని పేర్కొన్నారు. కాగా ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాల్లో ఇప్పటివరకు 20 మంది మెడికల్ ఆఫీసర్లు ఉన్నట్టు వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మల్కాపూర్‌లో పర్యటిస్తున్న 'గడా' అధికారి ముత్యంరెడ్డి

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామాన్ని 'గడా' అధికారి ముత్యంరెడ్డి సోమవారం సందర్శించారు. ఈనెల 7వతేదీన గ్రామంలో మంత్రి హరీశ్‌రావు పర్యటన ఖరారైన నేపథ్యంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పంచాయతీ భవనం, కమ్యూనిటీ హాల్, మహిళా భవనం, యూత్ అండ్ లైబ్రరీ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే రూ. 20 కోట్లతో యావపూర్ నుంచి మల్కాపూర్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నర్సింలు, ఉపసర్పంచ్ ఆంజనేయులుగౌడ్, వార్డు సభ్యులు, మేకిన్ అధ్యక్షుడు కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బస్తీబాట



సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో సోమవారం బస్తీబాట కార్యక్రమం కొనసాగింది. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు నాలుగో వార్డులో పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను వార్డు ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు పుట్టి యాదగిరి, చింతల యాదగిరి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ముందస్తు అరెస్టులు సరికాదు'

నర్సాపూర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీ నిధుల విషయంలో ఆడుతున్న డ్రామాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను అడ్డుకోవడానికి కాంగ్రెస్ శ్రేణులను ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని టీపీసీసీ రాష్ట్ర నాయకుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. సోమవారం ఆయన నర్సాపూర్‌లో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని.. బీఆర్‌ఎస్ నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): స్వయం ఉపాధి కోసం మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ భారతి సోమవారం తెలిపారు. మండలంలో రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షలతో ఒక్కో యూనిట్ల మంజూరు ఉందన్నారు. ఇందులో 80 శాతం సబ్సిడీ కాగా 20 శాతం బ్యాంక్ లోన్ ద్వారా అందిస్తామన్నారు. అర్హులైన మైనార్టీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో రెండు సెట్ల జిరాక్స్ పత్రాలు అందజేయాలని తెలిపారు. ఈనెల 5వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మోత.. వాత

పేరుకుపోయిన కరెంట్ బిల్లులు

వసూళ్లకు విద్యుత్‌శాఖ ప్రత్యేక కార్యాచరణ

- వ్యవసాయ కస్టమర్ చార్జీలు రూ. 8 కోట్లు
- ఇళ్ల బిల్లులు రూ. 25 కోట్ల మేర పెండింగ్



బిల్లులు చెల్లించని వారి స్టార్టర్ డబ్బాలను తొలగించిన సిబ్బంది

మెదక్‌జోన్: సాగుకు వాడుకునే ఉచిత విద్యుత్‌కు సంబంధించి సర్ చార్జీలను కొందరు ఏళ్ల తరబడి చెల్లించడం లేదు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. వాటికి తోడు ఇళ్ల బిల్లులు తడిసి మోపడయ్యాయి. బిల్లులు చెల్లించని మొండి బకాయిదారుల ఇంటికి విద్యుత్ సరఫరాను సిబ్బంది నిలిపివేస్తున్నారు. బోరుబావుల వద్ద స్టార్టర్ డబ్బాలను తీసుకెళ్తున్నారు.

- జిల్లావ్యాప్తంగా వ్యవసాయ బోరుబావుల కనెక్షన్లు 98 వేలు ఉండగా వాటికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తోంది.
- కానీ సర్‌చార్జీ పేరిట రోజుకు ఒక రూపాయి చొప్పున ఏడాదికి రూ. 360 వసూలు చేస్తుంది.
- కొందరు రైతులు పదేళ్లుగా వాటిని చెల్లించకపోవడంతో జిల్లావ్యాప్తంగా రూ. 8 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి.
- అలాగే జిల్లాలో రెండు లక్షల ఇళ్లకు సర్వీస్ కనెక్షన్లు ఉండగా. జిల్లావ్యాప్తంగా రూ. 25 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి.
- మొత్తంగా రూ. 33 కోట్ల కరెంట్ బిల్లులు పేరుకుపోయినట్టు సంబంధిత జిల్లా అధికారులు చెబుతున్నారు.
- వీటి వసూళ్లకు విద్యుత్‌శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. బిల్లుల వసూలు తప్పనిసరిగా చేయాల్సిందేనని ఏఈ, ఏడీ, డీఈలను వారి వారి పరిధిలో ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రూ. 33 కోట్ల మేర బకాయిలు

- వ్యవసాయానికి సంబంధించి నెలకు రూ. 30 చెల్లించాల్సిన సర్‌చార్జీలను కొంత మంది రైతులు 10 నుంచి 15 ఏళ్లుగా చెల్లించక పోవడంతో రూ. 5 వేల నుంచి రూ. 8 వేల వరకు బకాయిలు పేరుకుపోయాయి.
- మొండి బకాయిల వసూళ్లకు విద్యుత్ అధికారులు వారి స్టార్టర్ డబ్బాలను కట్ చేసి సంబంధిత సబ్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు.
- అలాగే ఇళ్ల బిల్లుల కోసం బకాయిదారుడి ఇంటి కనెక్షన్ కట్ చేసి మరీ బకాయిల వసూలు చేస్తున్నారు.
- ఇళ్లకు సంబంధించి జిల్లావ్యాప్తంగా రూ. 25 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని గ్రామాలకు విద్యుత్ నిలిపి వేసి వసూలు చేస్తున్నారు.
- ఈక్రమంలో సదరు బకాయిదారుడిపై ఒత్తిడి చేసి బిల్లులు వసూలు చేస్తున్న నేపథ్యంలో కొంతమంది అధికార పార్టీ నాయకులు క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేసి మాట్లాడించే ప్రయత్నాలు చేస్తునట్టు తెలిసింది.

మండల సమావేశంలోనూ చర్చ

- ఇటీవల చిన్నశంకరంపేట మండల సర్వసభ సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లుల వసూళ్లకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

వసూళ్లపై దృష్టి సారించాం



పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్ సర్‌చార్జీలతో పాటు ఇళ్ల బకాయిలు జిల్లా వ్యాప్తంగా రూ. 33 కోట్లు పేరుకుపోయాయి. వసూలు చేసేందుకు ఏఈ, ఏడీ, డీఈలకు ఆదేశాలు ఇచ్చాం. బకాయిలు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలి.

– జానకీరాం, ఎస్ఈ

- మండలంలో సర్ చార్జీలకు సంబంధించిన బిల్లులు రూ. 15 లక్షల పెండింగ్ ఉండగా ఇళ్లకు సంబంధించి రూ. 64 లక్షల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం ఒక్క మండలంలోనే మొత్తం రూ. 79 లక్షల బకాయిలు పేరుకుపోయాయి.
- జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.



దర్శనానికి తరలివచ్చిన భక్తులు

'ముక్కోటి' శోభ

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. మెదక్ పట్టణంలోని వెంకటేశ్వర ఆలయం, కోదండ రామాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఉదయం 4 గంటల నుంచే ఆలయాల్లో రద్దీ ప్రారంభం కాగా దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి దంపతులు జిల్లా కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి, వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి పల్లకీని మోశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వామి వారి అనుగ్రహంతో మెదక్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిషనర్ జానకి రామ్, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి పల్లకీ సేవలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

పండగలోగా బడులు ప్రారంభిస్తాం

డీఈఓ రమేశ్



పనులను పర్యవేక్షిస్తున్న డీఈఓ రమేశ్

అల్లాదుర్గం(మెదక్): జిల్లాలో 'మన ఊరు–మన బడి' కింద ప్రభుత్వం రూ. 150 కోట్లు మంజూరు చేసిందని జిల్లా విద్యాధికారి రమేశ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కాయిదంపల్లిలో మన ఊరు– మన బడి కింద నిర్మిస్తున్న మోడల్ స్కూల్ పనులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 42 ప్రభుత్వ పాఠశాలలను సంక్రాంతిలోపు మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో లేని సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ బచ్చునాయక్, హెచ్‌ఎం రంజానాయక్, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

పెద్ద శంకరంపేట(మెదక్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు– మనబడి పనులను వేగవంతం చేయాలని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. సోమవారం పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బద్దారంలో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి బుచ్చా నాయక్, మండల నోడల్ ఆఫీసర్ రాజేశ్వరరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విఠల్, విజయ్ కుమార్, ఆర్పీలు, తదితరులు ఉన్నారు.

చట్ట ప్రకారం న్యాయం చేయండి

ఎస్పీ రోహిణీ ప్రియదర్శని



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శని పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వెల్దుర్తి మండలం శేరిపల్లికి చెందిన బండ అంజయ్య పెద్దల ద్వారా వచ్చిన ఆస్తిని మా తమ్ముడు నాకు తెలియకుండా పట్టా మార్పిడి చేసుకున్నాడని.. కోర్టుకు వెళితే నాపై కక్ష గట్టి దాడికి పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేశారు. చట్ట ప్రకారం తగిన న్యాయం చేయాలని వెల్దుర్తి ఎస్ఐ సూచించారు. అలాగే మెదక్ పట్టణం అజంపుర కాలనీకి చెందిన యమున తమ పక్క ఇంటి వారు గృహ నిర్మాణం చేపట్టి మా స్థలంలోకి స్లాబ్ వైశాల్యాన్ని పెంచారని.. ఇదేమని అడిగితే దూషణలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసింది. చట్ట ప్రకారం యమునకు తగిన న్యాయం చేయాలని మెదక్ పట్టణ సీఐకి సూచించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ వివరించారు.

కేలండర్ ఆవిష్కరణ

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కేలండర్‌ను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు రామారావు, రాజు, మహేశ్, నర్సింలు, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే పీఆర్టీయూటీఎస్ కేలండర్‌ను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ, పత్రికా సంపాదకవర్గ సభ్యుడు వెంకటరామిరెడ్డి, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తపస్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఈఓ

ఆరోగ్య సిద్దిపేటే లక్ష్యం

- త్వరలో వెయ్యి పడకల ఆస్పత్రి ఏర్పాటు
- బస్తీ దవాఖానాను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ఆరోగ్య సిద్దిపేట లక్ష్యంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, త్వరలో సిద్దిపేట ప్రజలకు వెయ్యి పడకల ఆస్పత్రి అందుబాటులోకి రానుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని 11వార్డులో బస్తీ దవాఖానాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్తీ ప్రజల ఆరోగ్యం కోసం ఎక్కడికక్కడ బస్తీ దవాఖానాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. ఇక్కడ అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో గుండె, కిడ్నీ, కేన్సర్ తదితర వ్యాధులకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. కరోనా నేపథ్యంలో పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. 10 కిలోల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. సంక్రాంతి తర్వాత సొంత ఇంటి స్థలం ఉన్న వారికి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలను సాయంగా ఇస్తున్నట్లు తెలిపారు.

పామాయిల్ సాగుపై ఆసక్తి చూపాలి

అనంతరం క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావు ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపాలని, అవసరమైన సాయం అందిస్తామని ఆయన వివరించారు. ఈ ఆర్థిక ఏడాదిలో 10 వేల ఎకరాల సాగు లక్ష్యంగా ఉండగా, వీటిలో 3,400 ఎకరాల్లో సాగు జరిగిందన్నారు. ఆయిల్‌పామ్ సాగు క్రమంలో డ్రిప్‌కు 1,346 ఎకరాలకు డీడీలు చెల్లించగా 305 ఎకరాల్లో డ్రిప్ సిద్ధం అయిందన్నారు. మిగతా 1040 ఎకరాల్లో రైతులకు రోజు వంద చొప్పున డ్రిప్ పరికరాలు ఇస్తున్నట్లు తెలిపారు. మంత్రి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, అధికారులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇప్పించండి

- ప్రజావాణిలో రైతుల మొర
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రమేశ్



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: టీఎస్ఐఐసీకి తమ భూములు అప్పగించారని నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామ రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించగా జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌తో కలిసి అదనపు కలెక్టరేట్ రమేశ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి వెనువెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 33 అర్జీలు రాగా.. ప్రధానంగా ధరణి, పోడు భూములకు సంబంధించినవి 29 రాగా, డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం నాలుగు దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి అనంతరం అదనపు కలెక్టర్ రమేశ్ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణమూర్తి, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్ రావు, సీపీఓ మహ్మద్ కాసిం, మత్స్యశాఖ ఏడీ రజిని, పశుసంవర్ధక శాఖ అధికారి విజయ శేఖర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి జెంలానాయక్, కలెక్టరేట్ ఏఓ, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు రావడం లేదు



తనకు 2019 నుంచి రైతు బంధు డబ్బులు రావడం లేదు. ఏళ్ల తరబడి తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి న్యాయం చేయాలి.

– బాబు, బూర్గుపల్లి, హవేళిఘణాపూర్ మండలం

అధికారులు ఇబ్బంది పెడుతున్నారు



మా గ్రామ శివారులో రెండెకరాల అసైన్డ్ భూమి ఉంది. దానిలో గత 40 ఏళ్లుగా సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నా. కానీ రెవెన్యూ అధికారులు భూమిని ఆన్‌లైన్‌లో తొలగించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

– దండెరాజు, నారాయణపూర్, నర్సాపూర్ మండలం

నా భూమి మాయం చేశారు



మా అమ్మ గత ఆరు నెలల క్రితం చనిపోయింది. ఆమె పేరు మీద ఉన్న 2 ఎకరాల వ్యవసాయ భూమిని నా పేరు మీద మార్చుకుందామనుకున్నా. కానీ మా అమ్మ చనిపోయిన నెల రోజులకే మా భూమి ఆన్‌లైన్‌లో నుంచి తొలగించారు.

– అన్నె కిషన్, డి.ధర్మారం

క్లుప్తంగా

మల్లికార్జునస్వామి కల్యాణానికి రండి



శ్రీకాంత్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని రుద్రారంలో ఈ నెల 7,8,9 తేదీల్లో జరగనున్న శ్రీ మల్లికార్జునస్వామి కల్యాణానికి హాజరు కావాలంటూ నిర్వాహకులు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం శ్రీకాంత్‌గౌడ్ తనవంతు సాయంగా స్వామి కల్యాణానికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున స్వామి కల్యాణ నిర్వాహకులు కుర్మ సంగమేశ్, నరసింహ, సాయి గణేశ్, మునిరాజ్, రాఘురామ్, ఎస్‌ఆర్‌కె నాయకులు రాజు గోపాల్ యాదవ్, ధన్‌రాజు, డీడీ సాయి, ఆదిత్య పాల్గొన్నారు. ఫొటో ఉంది.

ఏప్రిల్ 29న నవోదయ ఎంట్రెన్స్

వర్గల్(గజ్వేల్): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు సిద్దిపేట జిల్లా వర్గల్ జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ రమేశ్‌రావు తెలిపారు. ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష ఉంటుదని, అభ్యర్థులు ఈ నెల 31వరకు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. విద్యార్థులు మే 5, 2011 నుంచి ఏప్రిల్ 30, 2013 మధ్య జన్మించి, ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్నవారు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు హెచ్‌ఎం సంతకంతో కూడిన పత్రం, అభ్యర్థి, పేరెంట్ సంతకం చేసిన పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ



తనిఖీ చేస్తున్న జిల్లా కోఆర్డీనేటర్ జాన్‌షాహిద్

మనూరు(నారాయణఖేడ్): మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో సేవలందిస్తున్న 108 అంబులెన్స్‌ను జిల్లా కోఆర్డీనేటర్ జాన్‌షాహిద్ సోమవారం తనిఖీ చేశారు. ఈఎంఈ హుస్సేన్‌తో కలిసి నాగల్‌గిద్ద 108 సర్వీస్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈఎంటీ సుకెందర్, పైలెట్ అశోక్ ఉన్నారు.

స్కూటర్‌ను ఢీకొట్టిన బొలెరో

వ్యక్తి మృతి



మొహ్మద్ మృతదేహం

నర్సాపూర్ రూరల్: స్కూటర్‌ను బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ – సంగారెడ్డి రోడ్డులో చోటుచేసుకుంది. నర్సాపూర్ ఎస్‌ఐ గంగరాజు వివరాల ప్రకారం హైదరాబాద్ గాజుల రామారాంకు చెందిన ఎండీ మొహ్మద్ (33) సోమవారం తన స్కూటర్‌పై సంగారెడ్డి నుంచి నర్సాపూర్ వెళుతుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో మొహ్మద్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జల్ జీవన్ మిషన్ సర్వే

- అమృత్ పట్టణాలు, మున్సిపాలిటీల్లో సర్వే
- త్వరలో సిద్దిపేటలో కేంద్ర బృందం పర్యటన
- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన అధికారులు
- మురుగు జలాల శుద్ధి, పునర్వినియోగంపై పరిశీలన



సిద్దిపేట మున్సిపాలిటీ

సాక్షి, సిద్దిపేట: మున్సిపాలిటీల పరిధిలో మంచినీటి సరఫరా, మురుగునీటి శుద్ధి అంశాలపై కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ జల్ సర్వేక్షణ్–2023 పేరటి సర్వేకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఉన్న అమృత్ నగరాలు, మున్సిపాలిటీల్లో సర్వే నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా తెలంగాణ నుంచి 11 పురపాలికలను ఎంపిక చేయగా, అందులో సిద్దిపేట ఒకటి. సర్వేలో భాగంగా నగరాల్లోని మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల లభ్యతపై కూడా సమాచారం సేకరించి, నివేదిక ఆధారంగా మార్కులను కేటాయించనున్నారు. ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో పాటు శాంపుల్ కలెక్షన్, ల్యాబరేటరీ టెస్టింగ్, ఫీల్డ్ సర్వే నిర్వహించనున్నారు. కాగా దీనికి సంబంధించిన వివరాలను ఇప్పటికే మున్సిపల్ అధికారులు వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. మరో వారం రోజుల్లో కేంద్ర బృందం సిద్దిపేటలో పర్యటించనున్నారు.

మురుగునీటి శుద్ధి ఇలా..

- రాష్ట్ర ఆర్థిక, మౌళిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎఫ్‌ఐడీసీ), అమృత్ పథకంలో భాగంగా సిద్దిపేట పట్టణంలో రూ.278.48కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు.
- ఇందులో భాగంగా పట్టణంలో వెలువడే మురుగు నీటిని శుద్ధి చేసేందుకు చింతల్ చెరువు, నర్సాపూర్ చెరువు వద్ద సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను(ఎస్‌టీపీ) నిర్మించారు.
- ఎస్టీపీలకు చేరే మురుగు నీటిని ఎస్‌బీఆర్ టెక్నాలజీతో రోజుకు 1.6కోట్ల లీటర్ల నీటిని శుద్ధి చేసి, మంచి నీటిగా మార్చుతున్నారు.
- ఈ ప్లాంట్ల ద్వారా శుద్ధీకరణ అనంతరం 10 లీటర్ల మురుగు నీటికి సుమారుగా 9 లీటర్ల వరకు మంచినీరుగా మారుతోంది.
- మిగతా మురికి, సిల్ట్, ఇసుక చెత్తను టెక్నాలజీ సాయంతో యూరియాగా మార్చుతున్నారు.
- ఎప్పటికప్పుడు ల్యాబ్ ద్వారా నీటి సాంద్రతను పరీక్షించి, శుద్ధి అనంతరం ట్యాంకర్ల ద్వారా రోడ్ల పక్కన నాటిన మొక్కలకు అందిస్తున్నారు.

మంచినీటి సరఫరా..

- సిద్దిపేట మున్సిపాలిటీలో 43 వార్డులు 54.55 చదరపు కిలోమీటర్ల పరిధి ఉంది.
- పట్టణంలో 41,322 గృహాల్లో 1,57,026 మంది నివసిస్తున్నారు.
- 24,012 ఇళ్లకు తాగునీటి కనెక్షన్ ఉండగా, 370 కిలో మీటర్ల పైప్‌లైన్ ఉంది.
- సిద్దిపేట మున్సిపాలిటీకి కరీంనగర్ ఎల్‌ఎండీ నుంచి నీరు సరఫరా అవుతోంది.
- ప్రతీ రోజు పట్టణానికి 21.20 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉండగా ప్రస్తుతం 20.10ఎంఎల్‌డీ తాగు నీరు అందుతోంది.
- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో 244 పవర్ బోర్‌వెల్స్, 139 చేతి పంపులు ఉన్నాయి.

వివరాలు పొందుపరిచాం



జల సర్వేక్షణ్ సర్వే కోసం ఇప్పటికే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. త్వరలో కేంద్రం బృందం పర్యటించి యూజీటీ ద్వారా మురుగు నీటి ఎస్‌టీపీతో నీటిని శుద్ధిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రత్యక్షంగా వివరాలను సేకరిస్తారు.

– రవీందర్ రెడ్డి, కమిషనర్, సిద్దిపేట మున్సిపాలిటీ

ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి



మాట్లాడుతున్న బసవలింగ పట్టదేవరు

కంగ్టి(నారాయణఖేడ్): శరణు భాగీరథీబాయి బోధనలు నేటి యువతకు అనుసరణీయమని కర్ణాటకలోని భాల్కి పీఠాధిపతి బసవలింగ పట్టదేవరు పేర్కొన్నారు. మండలంలోని నాగుర్(బీ)లో నిర్వహించిన భాగీరథీబాయి సంస్మరణ సభకు హాజరై మాట్లాడారు. భక్తికి సోదరభావం, ప్రేమ, పెద్దల పట్ల ఆదరణ కలిగి ఉండటమే ప్రధానమని తెలిపారు. కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప తదితరులు దీపప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మహాప్రసాదం పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

మెదక్ జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి లక్ష్మీశారద



జిల్లా న్యాయసేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మెదక్‌జోన్: ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ సేవ కేంద్రం ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రిన్సిపాల్ సెషన్ జడ్జి లక్ష్మీశారద తెలిపారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యాయసేవాధికార కేంద్ర కార్యాలయాన్ని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం జిల్లా ప్రిన్సిపాల్ సెషన్ జడ్జి లక్ష్మి శారద మాట్లాడుతూ పేద ప్రజలకు న్యాయ సేవలందించేందుకు జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ 25 ఏళ్లుగా సేవలు అందిస్తోందని అన్నారు. కోర్టు కేసుల్లో న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని పేదవారికి ఉచితంగా న్యాయం సాయం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న న్యాయ సేవా సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం న్యాయ సేవ సంస్థ భవనంలో ఎస్పీ రోహిణీ ప్రియదర్శినితో కలిసి పూజలు నిర్వహించి, కోర్టు ఆవరణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో న్యాయవాదులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ కం సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, ప్రథమశ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రీటా లాల్ చాంద్, జూనియర్ సివిల్ జడ్జి కల్పన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫైజల్ అహ్మద్ పాల్గొన్నారు.

డంప్ యార్డు సమస్యను పరిష్కరించండి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్

మెదక్ కలెక్టరేట్: మెదక్ పట్టణంలోని 5వ వార్డులో డంప్‌యార్డు సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు కోరారు. సోమవారం కలెక్టర్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా యార్డ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వెలువడుతున్న పొగ, దుర్వాసన స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఆయనతో కాంగ్రెస్ నాయకులు మీర్జాబేగ్, రాజలింగం, కొండ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

గజ్వేల్‌రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం డీబీఎఫ్ నాయకులు మాట్లాడుతూ సీఎం అధ్యక్షతన రాష్ట్ర స్థాయి హైపర్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి జనవరి, జూలై మాసాల్లో చట్టం అమలుపై సమీక్ష జరపాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని, అట్రాసిటీ అగైనెస్ట్ ఎస్సీ, ఎస్టీ టోల్‌ఫ్రీ నంబర్ 14566 పనిచేసేలా చూడాలని, ప్రతీ నెల చివరి రోజున పౌరహక్కుల దినోత్సవం నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు ఉన్నారు.

గుండెపోటుతో కోఆప్షన్ సభ్యుడి మృతి



జహీరాబాద్: మొగుడంపల్లి మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు తాజొద్దీన్ సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. అసద్‌గంజ్ గ్రామానికి చెందిన తాజొద్దీన్ కాంగ్రెస్ పార్టీ నుంచి కో–ఆప్షన్ సభ్యుడిగా గెలుపొందాడు. అందరితో కలుపుగోలుగా ఉండే తాజొద్దీన్ మరణంపై పలువురు విచారం వ్యక్తం చేశారు. జహీరాబాద్, మొగుడంపల్లి ఎంపీపీ అధ్యక్షుడు ఎస్.గిరిధర్‌రెడ్డి, ప్రియాంక గుండ్‌రెడ్డి, జెడ్పీటీసీలు నాగిశెట్టిరాథోడ్, అరుణ మోహన్‌రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

మందుబాబులకు జరిమానా



పట్టుబడిన మందుబాబులు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి వివరాల ప్రకారం పట్టణంలో శనివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మంది పట్టుబడగా, వీరిని సోమవారం కోర్టులో హాజరు పర్చారు. విచారించిన జడ్జి 20 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు, ఇద్దరికి రూ.2,500, మరో వ్యక్తికి రూ.3వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని ఇంజినీర్ మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ ఇంజినీర్ మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చెన్నైకి చెందిన రామస్వామి (27) ఓ ప్రైవేట్ సంస్థలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆ సంస్థ చేపట్టిన జాతీయ రహదారి పై ఓవర్ నిర్మాణంలో భాగంగా సోమవారం తెల్లవారు జామున పట్టణంలోని గండమ్మ ఆలయ సమీపంలో పనులను పర్యవేక్షిస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని డీసీఎం వ్యాన్ కొట్టింది. గాయాలైన రామస్వామిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చిల్వెర గ్రామ శివారులో పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. గ్రామ శివారులో గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్య, సింధోల్ అంజయ్య, దామరంచ శ్రావణ్, మేతరి దుర్గయ్య, ఎండీ రఫిక్ పేకాడుతుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.13 వేల నగదు సీజ్, ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



వాంకుటోతు రాజు మృతదేహం

అక్కన్నపేట(హుస్నాబాద్): అప్పుల బాధతో ఓ రైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం బంగారు లొద్దితండాలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తాండ్ర వివేక్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వాంకుటోతు రాజు(45) తనకున్న 32 గుంటల వ్యవసాయ భూమిలో వివధ పంటలను సాగు చేశాడు. ఇటీవల తన కుమార్తె పెళ్లికి, సాగు చేసిన పంటలకు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతుండేవాడు. ఈ విషయమై రెండురోజుల కింద కుటుంబంలో గొడవ జరిగింది. మనస్తాపం చెందిన రాజు పొలం వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు వాంకటోతు లాల్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేటరూరల్: మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం అందించకుండా వేధించిన మద్దూరు ఎస్సీ ప్రీమెట్రిక్ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరవింద్, దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. మద్దూర్ ఎస్సీ వార్డెన్ రమణారెడ్డి గతంలో దుద్దెడలో ఉన్నప్పుడు విద్యార్థులను కొట్టి హాస్టల్‌ను మూసివేశారని అన్నారు. మద్దూరు హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉంటే 80 మంది ఉన్నట్లు చూపి బిల్లులు పెట్టాడని, హాస్టల్ విద్యార్థులకు నీళ్ల చారు, పురుగుల అన్నం పెడుతున్నారని, నకిలీ రిజిస్టర్‌తో విద్యార్థులకు రావాల్సిన డబ్బులను దోచుకుంటున్నాడని ఆరోపించారు. విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్, ఆముదాల రంజిత్ రెడ్డి, జిల్లా సహాయక కార్యదర్శి నవీన్, కమిటీ సభ్యుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని దామరంచ గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంతో రెండు ఇళ్లు దగ్ధమైనట్లు గిర్దవార్ సందీప్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దోమల భాను ఇంట్లో విద్యుత్ మీటర్‌లో మంటలు చెలరేగాయి. భాను ఇంటి పక్కనే ఉన్న దాలె జగన్నాథంకు చెందిన ఇంటికి కూడా మంటలు అంటుకున్నాయి. గుర్తించిన కుటుంబసభ్యులు ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయగా, అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదంలో భాను ఇంట్లో రూ.20 వేల నగదు, రూ.50వేల విలువైన కొత్త బట్టలు, రూ.60వేల ఆస్తినష్టం వాటిల్లింది. జగన్నాథం ఇంట్లో రూ.5 వేలు నగదు కాలిపోగా, రూ.40వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు గిర్దవార్ పేర్కొన్నారు.

అనుమతి లేకుండా అక్రమ నిర్మాణం



వ్యవసాయ భూమిలో చేపట్టిన భవన నిర్మాణం

నర్సాపూర్ రూరల్: వ్యవసాయ భూమిలో చేపట్టే నిర్మాణాలకు పంచాయతీ అధికారులు అనుమతి ఇవ్వకున్నా కొంతమంది యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. మండలంలోని లింగాపూర్‌లో నర్సాపూర్–వెల్దుర్తి రోడ్డును ఆనుకొని ఉన్న వ్యవసాయ భూమిలో ఓ వ్యక్తి పంచాయతీ అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టాడు. ఈ వ్యవసాయ భూమిలో కొంత అసైన్డ్ భూమి గాకా, సుమారు 2 గుంటల వరకు శ్మశానవాటిక స్థలం ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. భవన నిర్మాణ అనుమతి కోసం సదరు వ్యక్తి పంచాయతీలో దరఖాస్తు చేసుకోగా అసైన్డ్ భూమి, పానాది దారి, శ్మశానవాటిక స్థలం సమస్యలతో అధికారులు అనుమతి నిరాకరించారు. అయినా సదరు వ్యక్తి భవన నిర్మాణం ఆపడంలేదు. ఈ విషయమై డీపీఓ యాదయ్యను వివరణ కోరగా.. స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైద్యులు లేక రోగుల ఇక్కట్లు



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నర్సులు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుడు లేకపోవడంతో సోమవారం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు పీహెచ్‌ఎన్‌లు, స్టాఫ్ నర్సులు వెద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎంలు రక్త నమూనాలు సేకరించి వివరాలు తర్వాత చెబుతామని వారిని పంపించారు. ఈ విషయమై పీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్ యాదగిరిరావును వివరణ కోరగా వైద్యురాలు లీవ్‌లో ఉందని, చేగుంట మెడికల్ ఆఫీసర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా, ఆయన రావడం లేదని తెలిపారు. రక్త పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్ టెక్నీషియన్ కూడా అందుబాటులో లేరని, సంబంధిత అధికారులు స్పందించి త్వరగా వైద్యుడిని నియమించాలని కోరారు.

రసాభాసగా ఆలయ నిర్వహణ సమావేశం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ అనిల్‌రెడ్డి

- లెక్కలు చెప్పాలని గ్రామస్తుల డిమాండ్
- రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి



ఆలయానికి తాళం వేసిన దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం (శిలాంకోట) రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్వహణపై సోమవారం ఏర్పాటు చేసిన సమావేశం ఘర్షణకు దారి తీసింది. ఆలయ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఆలయానికి వచ్చిన ఆదాయం లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. కొంత మంది వాహనాలకు రుసుం వసూలు చేయాలని కోరగా, వసూలు వద్దని, ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపాలని మరికొంతమంది డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలిపేందుకు కృషి చేస్తున్నామని, చైర్మన్ అనిల్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్ రెడ్డికి. ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చినట్లు పర్కొన్నారు. సమావేశం కోసం పూజారులు ఆలయానికి తాళం వేయడంతో ఆలయానికి వచ్చిన భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. స్థానికులు గొడవ చేయడంతో పూజారులు ఆలయానికి చేరుకుని తాళం తీశారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మాసెపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తికి సంబంధించిన రూ. 60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం ఎంపీపీ స్వరూప బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ వెంకట లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెరటికోళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పెరటికోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న వారు వాటి కోసం దరఖాస్తు చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్ అన్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి 20 యూనిట్ల పెరటి కోళ్లు మంజూరు అయ్యాయన్నారు. వాటిలో ఎస్సీలకు 3 యూనిట్లు, ఎస్టీలకు 2 యూనిట్లు, ఇతరులకు 15 యూనిట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిస్ట్రిక్ట్ వెటర్నరీ అండ్ ఎనిమల్ హస్బెండరీ ఆఫీసర్ మెదక్ పేరుమీద రూ. 600 డీడీ చెల్లించడంతో పాటు, ఆధార్ కార్డు, పాస్ ఫొటో, బ్యాంకు ఖాతా, కుల ధృవీకరణ, జాబ్‌కార్డ్, డీడీ, రేషన్ జిరాక్స్‌లను ఈ నెల 6 వరకు పశువైద్యశాల చిట్కుల్‌లో అందజేయాలన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



బ్యాటింగ్ చేస్తున్న త్రిష దామోదర్

రేగోడ్(మెదక్): యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ మహిళా నేత త్రిష దామోదర్ ఆకాంక్షించారు. మండలంలోని పెద్దతండాలో సోమవారం నిర్వహించిన సీడీఆర్ క్రికెట్ టౌర్నమెంట్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

భూ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న కొండాపూర్ ప్రజాప్రతినిధులు

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన వారిలో మిగిలిన వారికి నష్టపరిహారం అందించాలని కొండాపూర్ ఉప సర్పంచ్ వెంకట్ ప్రజావాణిలో కోరారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రైతుల భూములను పరిశ్రమల కోసం తీసుకొని నష్టపరిహారం ఇచ్చారన్నారు. ఇంకా 17 మంది వరకు ఇవ్వలేదని వారికి కూడా జాప్యం చేయకుండా నష్టపరిహారం అందివ్వాలని మెదక్ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌ను కోరారు. వారి వెంట వార్డు సభ్యులు చింతల బాబు, తుడి యాదగిరి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక ధృఢత్వం ఉంటుందని నవభారతి పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్‌గౌడ్, వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ పోచయ్య అన్నారు. సోమవారం మండలంలోని జగ్గంపేట గ్రామంలోని మార్షల్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నవభారతి పాఠశాల విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మహేష్, దేవి, శిరీష, గంగవేణి తదితరులు పాల్గొన్నారు.

7న మరకత మల్లికార్జున స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నర్సాపూర్ రూరల్: ఈనెల 7 నుంచి 11 వరకు నర్సాపూర్ రాయరావు చెరువు సమీపంలో వెలసిన శ్రీ మరకత మల్లికార్జున స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాములు యాదవ్, మల్లేశ్‌యాదవ్, నరేష్ యాదవ్, శేఖర్ యాదవ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి

జిల్లా వ్యాప్తంగా సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రజాప్రతినిధులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా వైష్ణవ ఆలయాల్లో స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. దీంతో తెల్లవారుజాము నుంచే ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి.

మనోహరాబాద్(తూప్రాన్): వైకుంఠ ఏకాదశి సందర్భంగా పలు గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మండలంలోని కాళ్ళకల్ బంగారమ్మ దేవాయలంలోని జడల వేంకటేశ్వర స్వామిని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు.

రామాయంపేట(మెదక్): వైకుంఠ ఏకాదశి సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం పట్టణంలోని కోదండ రామాలయం, వెంకటేశ్వర ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ఆలయాల్లో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సరాపు యాదగిరి, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రాజు, దేమె యాదగిరి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పుట్టి యాదగిరి, చంద్రపు కొండల్‌రెడి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సాపూర్: ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి సందర్భంగా సోమవారం తిరుమల వెంకటేశ్వరస్వామిని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి తదితరులు తిరుపతికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి, సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి, దొంతి వేణుగోపాలస్వామి, కొంతన్‌పల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్లను ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శించుకున్నారు. సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామిని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీరాయగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నాయకులు, భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని వేంకటేశ్వర దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు రాగా అర్చకుడు వాసుదేవచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తూప్రాన్: పట్టణంలోని రామాలయం సమీపంలోని కూర్మ నరసింహస్వామికి పురోహితుడు అహోబిలం రమణయ్య ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ వైష్ణ సంఘం నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని కల్వకుంట, చల్మెడ గ్రామాల్లోని వెంకటేశ్వర ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అనంతపద్మనాభస్వామి గుట్టపై భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గడిపెద్దాపూర్, అల్లాదుర్గం వెంకటేశ్వర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గడిపెద్దాపూర్ వెంకటేశ్వర దేవాలయంలో వెంకటేశ్వర కల్యాణం ఘనంగా నిర్వహించారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలోని తిరుమలయ్య గుట్ట, రంగంపేట రంగనాయక స్వామి దేవాలయం, సంగాయిపేటలోని వెంకటేశ్వరుని గుట్టపైన ఉన్న వెంకటేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్ద శంకరంపేట(మెదక్): పేటలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, నాయకులు దాదిగారి గంగాధర్, మహంకాళి కృష్ణమూర్తి, సర్వేశ్వర్, సతీష్‌గౌడ్, అశోక్, అజయ్, సిద్ధూ, మణికంఠ తదితరులు ఉన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్న రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



తూప్రాన్: నరసింహస్వామి దేవాలయంలో..



కొల్చారం(నర్సాపూర్): సంగాయిపేటలో..



రామాయంపేట(మెదక్): స్వామివారిని దర్శించుకుంటున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



నర్సాపూర్: తిరుమలలో స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్ళకల్‌లో బంగారమ్మ దేవాలయం వద్ద భక్తులు



పెద్ద శంకరంపేట(మెదక్): వెంకటేశ్వర ఆలయంలో..



శివ్వంపేట(నర్సాపూర్): కొంతన్‌పల్లిలో కొలువైన వెంకటేశ్వస్వామి



శివ్వంపేట(నర్సాపూర్): లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న ప్రతాప్‌రెడ్డి



నిజాంపేట(మెదక్): కల్వకుంటలో..



అల్లాదుర్గం(మెదక్): ఆలయంలో పుష్పార్చన చేస్తున్న మహిళలు



చిన్నశంకరంపేట(మెదక్): అనంతపద్మనాభ స్వామి ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సోమవారం అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా జరిగింది. గురుస్వామి రామచంద్రాచారి ఆధ్వర్యంలో పడి పూజ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు వెంకట్రావు, రామన్న, శ్రీహరి, సాయిరాం, పరంధాం తదితరులున్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో అయ్యప్పస్వామి మండల దీక్ష ఆచరిస్తున్న స్వాములు సోమవారం శబరిమలకు తరలివెళ్లారు. అంతకుముందు గ్రామంలోని సంగమేశ్వర ఆలయంలో అయ్యప్ప స్వాములు అయ్యప్పస్వామి మహా పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు హరిదాస్ గురుస్వామి, గురుస్వాములు విజయ్ ప్రకాష్, ప్రభాకర్ గుప్తా, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



పూజలో అయ్యప్ప స్వాములు

పాఠశాల స్థలాన్ని సర్వే చేసి హద్దులు వేయాలి



రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రేగోడ్(మెదక్): మండలంలోని ఆర్.ఇటిక్యాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు గతంలో కేటాయించిన స్థలాన్ని పూర్తిగా సర్వే చేసి, హద్దులు వేయాలని డిమాండ్ చేస్తూ పార్టీలకతీతంగా గ్రామస్తులు సోమవారం రోడ్డుపై ధర్నా చేశారు. పాఠశాలకు మంజూరైన ప్రహరీకి పాఠశాల స్థలాన్ని వదిలి లోపలి నుంచి నిర్మిస్తున్నారని, సర్వే చేసి హద్దులు వేసే వరకు గోడ నిర్మాణాన్ని ఆపేయాలని స్థానికులు కోరారు. అనతరం పాఠశాల హెచ్‌ఎంకు వినతిపత్రాన్ని అందజేశారు.

చెక్కు అందజేత

రామాయంపేట(మెదక్): మండలంలోని నందగోకుల్ గ్రామానికి చెందిన కొమ్మిడి బాపురెడ్డికి కోళ్ల ఫారం నిర్మాణానికి మంజూరైన నిధులకు సంబంధించి చెక్కును సోమవారం సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ.. సహకార సంఘాల నుంచి రైతులకు కోళ్ల ఫారాలు, వారి పిల్లల చదువు కోసం విద్యా రుణాలు, అందజేస్తున్నామన్నారు. బాపురెడ్డికి మంజూరైన రూ. 16 లక్షల నుంచి మొదటి విడతగా రూ. 8 లక్షలకు సంబంధించి చెక్కు అందజేశామని చైర్మన్ వెల్లడించారు. మిగతా నిధులను త్వరలో అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ పరపాటి సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న సహకార చైర్మన్ చంద్రం

నిధులను వెంటనే విడుదల చేయాలి

హవేలిఘనపూర్ మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణరెడ్డి

మెదక్ రూరల్: నిధులను వెంటనే విడుదల చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. హవేలిఘనపూర్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ నారాయణరెడ్డి ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు నిధులను వెంటనే విడుదల చేయాలని సమావేశంలో ఏకగ్రీవతీర్మానం చేశారు. సర్వసభ సమావేశ తీర్మాన ప్రతులను ఎమ్మెల్యే ఎమ్మెల్సీ, కలెక్టర్‌కు అందజేయాలని అధికారులకు సూచించారు. సభలో ఆయా శాఖ అధికారులు ప్రగతి నివేదిక తెలిపారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ఏవో నాగమధురి మాట్లాడుతూ.. యాసంగికి సరిపడా ఎరువులు నిల్వ ఉన్నాయని, రైతులు ప్రభుత్వం సూచించిన ఎరువుల దుకాణంలో మందులు వాడకాలు జరపాలని తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో పంట అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ రాజేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన విధంగా కరెంట్ సరఫరా సక్రమంగా జరుగుతుందన్నారు. ఈ క్రమంలో సర్దన సర్పంచ్ సుభాష్ పలు సమస్యలను సభ దష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులు సమాధానమిచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రభుత్వ నిధులతో పనులు చేస్తే జీఎస్టీ పేరున 12 శాతం తీసి రికార్డు చేస్తున్నారని జీఎస్టీ శాతాన్ని తగ్గించి నిధులను పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇప్పియ్యాలని కోరారు. శిశు సంక్షేమ శాఖ వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేకంగా గ్రామాల్లో దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుజాత, ఎంపీడీఓ శ్రీరామ్, తహసీల్దార్ నవీన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి ఉత్సవ విగ్రహాల అందజేత



అర్చకుడికి ఉత్సవ విగ్రహాలు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్

రామాయంపేట(మెదక్): పట్టణంలోని వెంకటేశ్వర ఆలయానికి మున్సిపల్ చైర్మన్, గురుస్వామి జితేందర్‌గౌడ్ సోమవారం ఉత్సవ విగ్రహాలను అందజేశారు. ఆలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌తో పాటు అయ్యప్పస్వాములు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ కేలండర్ ఆవిష్కరణ

రామాయంపేట(మెదక్): తహసీల్దార్ మన్నాన్, పీఆర్టీయూ ప్రతినిధులు సోమవారం సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శి సారా సురేశ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆశయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరెడ్డి యాదవరెడ్డి, శ్రీనివాస్, మండల అసోసియేట్ అధ్యక్షుడు పిన్నం శ్రీనివాస్, కవిత, వేణుగోపాల్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): రైతు సహకార బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ బ్యాంకు మేనేజర్ ఎల్లయ్య అన్నారు. సోమవారం మండలంలోని సంగాయిపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై రైతులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు ఖాతాదారులకు రూ.436 చెల్లించినట్‌లైతే రూ.2 లక్షల జీవిత బీమా అందించనున్నట్లు తెలిపారు. అలాగే రూ.20 చెల్లించినట్లైతే రూ.2 లక్షల ప్రమాద బీమా అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మడూర్, గవ్వలపల్లి సహకార సంఘం చైర్మన్‌లు శ్రీనివాస్‌రెడ్డి, సూరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి , పీఏసీఎస్ సెక్రటరి కృష్ణ, డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ సంగమేశ్వర్ పాల్గొన్నారు.

'బైరి నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి'

మెదక్ మున్సిపాలిటీ: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రసంగాలు చేసిన బైరి నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ యువత జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం మెదక్‌లో మాట్లాడుతూ.. నాస్తిక వ్యవస్థలోకి అంబేద్కర్‌ను లాగడం సరికాదన్నారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు సంజీవులు, ప్రభాకర్, ప్రవీణ్, అనిల్ కుమార్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డ్ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

మెదక్ మున్సిపాలిటీ: వారంరోజులుగా మెదక్ పట్టణ శివారులోని డంప్‌యార్డులో మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. దీంతో కాలుష్యం విపరీతంగా వెదజల్లుతోంది. పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై డిసెంబర్ 31న 'సాక్షి' దినపత్రికలో చెత్తుకు నిప్పు – ప్రాణాలకు ముప్పు అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పాలకవర్గం డంపింగ్‌యార్డును మున్సిపల్ కమిషనర్ జానకిరాంసాగర్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఫైర్ అధికారులతో కలిసి పరిశీలించారు.



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ పాలకవర్గం

బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలి

నిజాంపేట(మెదక్): బీజేపీ అభివృద్ధి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలం కేంద్రంలో ఎల్లమ్మ ఆలయ సమీపంలో వివిధ బూత్‌శక్తి కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం వివిధ బూత్ శక్తి కేంద్రాలతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, నల్లాల విజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు జనార్దన్ రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ దేవిమధు, మండల ఇన్‌చార్జ్ నవత్ రాజేంద్రప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శులు మహంకాళి నరేష్, అవధూత మురళి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, అనుపాటి రాజిరెడ్డి, శ్రీనివాస్, రాజు, లక్ష్మణ్, రేవుల కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషక విలువలపై అవగాహన

తూప్రాన్: చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన పోషకాలపై అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ ఇందిరా తల్లులకు పోషకాలు కలిగిన ఆహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అనంతరం చిన్నారుల బరువు, ఎత్తులను కొలిచారు. ఏ ఆహారంలో ఎలాంటి పోషకాలు కలిగి ఉంటాయి అనే వాటిపై అవగాహన కల్పించారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



రామాయంపేటలో పోలీసుల అదుపులో కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్ రూరల్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల నిధుల మళ్లింపుపై ఇందిరా పార్కు వద్ద చేపట్టే ధర్నాకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లకుండా సోమవారం ఉదయం ముందస్తుగా వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మండలాధ్యకుడు మల్లేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్ గుప్తా, అశోక్, సురేష్ నాయక్, శ్రీశైలం యాదవ్, మల్లేశ్ యాదవ్, ఉదయ్, రషీద్, అజ్మత్ తదితరులు ఉన్నారు.

రామాయంపేట(మెదక్): పట్టణ కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు యాదగిరి ఖండించారు. అదుపులోకి తీసుకున్న వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చింతల యాదగిరి, ప్రధాన కార్యదర్శి అల్లాడి వెంకటి, మున్సిపల్ కౌన్సిలర్ బొర్ర అనిల్‌కుమార్, తదితరులున్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, సేవాదళ్ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ కృష్ణాగౌడ్, సీనియర్ నాయకులు కృష్ణ, దుర్గాగౌడ్ ఉన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పండరి అన్నారు. అరెస్ట్ అయిన వారిలో మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో అరెస్ట్ అయిన వారిలో మండల కాంగ్రెస్ నాయకులు, మండలాధ్యక్షుడు రమేశ్, టేక్మాల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్, పీఏసీఎస్ డైరెక్టర్ ఆకులపల్లి పాపయ్య, నాయకులు ఆశిలి సాగర్, మంగలి శివమల్లయ్య, అనీల్, ప్రవీణ్, ఎల్లంపల్లి గ్రామాధ్యక్షుడు శివశంకర్, రాజేశ్ గౌడ్, ఆగమయ్య, సాయిబాబా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో అరెస్ట్ అయిన వారిలో గజ్వేల్ నియోజకవర్గ టీఎస్‌టీయూసీ అధ్యక్షుడు నాగరాజు, కాళ్ళకల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో అరెస్ట్ అయిన వారిలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహేందర్, మండల ఉపాధ్యక్షుడు మారుతి, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, స్వామి, శివకుమార్, దత్తరెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి, అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

చేగుంట(తూప్రాన్): మండలంలో ముందస్తుగా అరెస్టు అయిన వారిలో చేగుంట పట్టణ అధ్యక్షులు వెంకటేశ్, గణేశ్, నార్సింగి మండల అధ్యక్షుడు గోవర్ధన్, ఉపసర్పంచ్ కేశవులు, అజయ్, రవి, ఖుర్షిద్‌లు ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ముందస్తుగా అరెస్టు అయిన వారిలో మండల కాంగ్రెస్ నాయకులు గంగారెడ్డి, రామచందర్, రాందాస్, బాగయ్య, ప్రభు, శివ, బాబర్ తదితరులున్నారు.